సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 20 । జూలై । 2025

పేదరికం జయించి.. కొలువులు సాధించి



వారంతా యువ ఎస్ఐలు.. కడుపేదరికం నుంచి వచ్చిన వారే.. కష్టపడి చదివి కొలువులు సాధించారు. తల్లి దండ్రుల కష్టానికి ప్రతిఫలం వీరు.. ఇటీవల ఉమ్మడి మెదక్ జిల్లాలో బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వారి కుటుంబ నేపథ్యం.. మనోభావాలు..

సండే స్పెషల్

- గన్నె తిరుపతి రెడ్డి, దుబ్బాక / రాంచర్ల వేణుగోపాల్ రెడ్డి, దుబ్బాకటౌన్

8లో

న్యూస్‌రీల్

ఆర్టీసీలో అప్రెంటీస్ మేళా

సంగారెడ్డి టౌన్: ఉమ్మడి మెదక్ జిల్లాలోని నిరుద్యోగులకు డిగ్రీ పట్టభద్రులకు డిపో పరిధిలోని మూడేళ్లపాటు అప్రెంటిస్ నిర్వహిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ విజయ భాస్కర్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇంజనీరింగ్ ఇన్ ఐటీ, కంప్యూటర్ సైన్స్‌లో 2021లో ఉత్తీర్ణులైనవారు ఈ అప్రెంటీస్‌కు అర్హులని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 21 నుంచి 27 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

రైతులకు అందుబాటులో ఉంటా

ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి



ఆత్మ కమిటీ చైర్మన్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ, సెట్విన్ చైర్మన్

జహీరాబాద్: ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉండి తగిన మేరకు సేవలందిస్తానని ఆత్మకమిటీ చైర్మన్ పి.రామలింగారెడ్డి పేర్కొన్నారు. జహీరాబాద్‌లోని పీవీఆర్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మ కమిటీ చైర్మన్‌గా రామలింగారెడ్డితో పాటు సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను తీసుకుంటున్నారన్నారు. ఇవి రైతులకు చేరేవిధంగా పాటుపడతానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన వారిందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆత్మ చైర్మన్, సభ్యులను ఎంపీ సురేశ్ షెట్కార్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి, ఐడీసీ మాజీ చైర్మన్ ఎం.డి.తన్వీర్‌లు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఏఓలు లావణ్య, అవినాష్‌కుమార్, వెంకటేశ్, అస్ముద్దీన్, వినోద్‌కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

డంప్‌యార్డ్‌పై కొనసాగుతున్న నిరసనలు



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న మహిళలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు 165వ రోజుకు చేరుకున్నాయి. నల్లవల్లి గ్రామంలో ఏర్పాటు చేపిన రిలే నిరాహార దీక్షలో స్థానిక మహిళలు పాల్గొని నిరసన వ్యక్త చేశారు. సుమారు ఐదు నెలలుగా డంపింగ్ యార్డ్ వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని మండిపడ్డారు. డంపింగ్‌యార్డ్ నిర్మాణ పనులు నిలిపే వరకు తమ ఆందోళనలు ఆపేదిలేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అధికారుల పనితీరుపై ఆగ్రహం



ఉపాధి హామీ సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): ఉపాధి హామీ అధికారులపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన ఝరాసంగం మండలప్రజాపరిషత్తు కార్యాలయంలో ఉపాధి హామీ అదనపు డీఆర్‌డీఓ బాల్‌రాజ్ శనివారం చేపట్టిన 15వ విడత సామాజిక తనిఖీలో పలువురు అధికారులు అవకతవకలకు పాల్పడినట్లు వెల్లడైంది. పలు గ్రామాల్లో ఉపాధి అధికారులు చేపట్టని పనులకు బిల్లులు చేయటం, గ్రామ పంచాయతీల్లో పనులు చేసిన వారికి కూలి చెల్లించటం, మస్టర్లలో కొట్టివేతలు, పనుల కొలతల్లో తేడాలు, చేపట్టిన పనుల కంటే అధికంగా బిల్లులు చేయటంతో పాటు వివిధ రకాల అక్రమాలకు పాల్పడినట్లు తనిఖీ బృందం సభ్యులు గుర్తించారు. దీంతో రూ.27వేల రికవరికి ఆదేశాలు జారీ చేస్తూ పలువురు అధికారులు తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు సుధాకర్, మంజుల, ఏపీఓ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు విడతల్లో ఎన్నికలు!

ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు

- సిబ్బందిని సరిచూసుకోమని ఈసీ ఆదేశం
- ఇదివరకే సిబ్బంది నియామకం
- బదిలీలు, పదోన్నతుల్లో మార్పుల పరిశీలన
- ఎన్నికల సామగ్రి సరిచూస్తున్న అధికారులు



నారాయణఖేడ్: స్థానిక సంస్థల పోరుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు ఎన్నికల సంఘం ఆదేశించడం, ప్రభుత్వం కూడా పంచాయతీరాజ్ శాఖను ఆదేశించడంతో క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రక్రియ మొదలైంది. అయితే ఈ ఎన్నికలను ఐదు విడతల్లో నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. వర్షాకాలం అయినందున ఎన్నికల నిర్వహణకు ఎదురయ్యే ఇబ్బందుల దృష్ట్యా ఐదు విడతలుగా నిర్వహించాలని భావిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇలా విడతల వారీగా నిర్వహిస్తే శాంతి భద్రతల నిర్వహణ, గిరిజన ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలకు పోలింగ్ సిబ్బంది, పోలీసుల తరలింపు సులువవుతుందని, పర్యవేక్షణలో కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. ప్రభుత్వం రిజర్వేషన్ల సమాచారం ఇవ్వగానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీకి ఒకే రోజు పోలింగ్ జరగనుంది.

అధికారుల్లో మొదలైన కదలిక

ఎన్నికలకు అవసరమైన సిబ్బంది, మెటీరియల్‌ను సిద్ధం చేసుకోవాలన్న సూచనలతో అధికారుల్లో కదలిక మొదలైంది. జిల్లా 26 జెడ్పీటీసీ, 26 ఎంపీపీ, 271 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఈ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. జిల్లాలో 7,83,379 ఓటర్లు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ సిబ్బంది డేటాను సిద్ధం చేయాలని కలెక్టర్లకు ఎన్నికల సంఘం తాజాగా ఆదేశించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో నమోదైన రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్, ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది వివరాలను మరోసారి పరిశీలించాలని ఈ సందర్భంగా ఈసీ సూచించింది. అలాగే జిల్లా, రెవెన్యూ, వార్డుల సంఖ్య ఆధారంగా పూర్తి వివరాలతో అందుబాటులో ఉండాలని కూడా సూచించింది.

డేటా సరిచూసుకుంటున్న అధికారులు

కాగా, ఎన్నికల నిర్వహణకు నియామకం అయిన ఎన్నికల సిబ్బంది వివరాలను జిల్లా అధికారులు సరిచూసుకుంటున్నారు. ఇటీవల బదిలీలు, పదోన్నతులు, రిటైర్మెంట్లు అయిన సిబ్బంది ఎవరైనా ఉంటే వారి స్థానంలో మరో అధికారి నియామకం గూర్చి వివరాలను సేకరిస్తున్నారు. మండలంలో ఉన్న రెండు లేదా మూడు ఎంపీటీసీలకు ఒక రిటర్నింగ్ అధికారి (గెజిటెడ్ అధికారి), ఒక అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిని నియమించి వారికి కేటాయించిన కేంద్రంలో వీరు నామినేషన్ల స్వీకరణ, స్క్రూటిని, తిరస్కరణ, అంగీకరణ, పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించడం చేపట్టనున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి, ఐదుగురు పోలింగ్ అధికారులను నియమించారు. ఎన్నికల నిర్వహణకు ఆర్డీఓ పరిధిలో ఎంపీడీఓ, తహసీల్దార్, రూట్ అధికారులు, ఎంసీసీ, వీడియోగ్రఫీ, ఎన్నికల అభ్యర్థి వ్యయం లెక్కింపు, అక్కౌంట్స్ బృందాలు పనిచేయనున్నాయి. పోలింగ్ ప్రక్రియ, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులు విధులు నిర్వర్తించనున్నారు.

సామగ్రి తనిఖీ..

ఎన్నికలకు సంబంధిచి సేకరించిన సామగ్రి తనిఖీ చేసి వాటి పనితీరుపై నివేదిక ఇవ్వాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ జిల్లా పరిషత్, జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బ్యాలెట్ బాక్సులతోపాటు, బ్యాలెట్ పేర్లకు అవసరమైన గులాబీ, తెలుపు రంగు పేపర్స్, పేపర్ సీల్స్, అడ్రస్‌ట్యాగ్‌లు, హ్యాండ్ బుక్‌లు, స్టాచ్యుటరీ, నాన్ స్టాచ్యుటరీ ఫామ్స్, కవర్స్ ఇదివరకే సరఫరా కాగా వాటిని పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న లలిత కుమారి

ఆ పిల్లలపై దృష్టి పెట్టాలి

జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి

పటాన్‌చెరు టౌన్: పోషణ లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి పేర్కొన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గౌతమ్‌నగర్ కాలనీలోని శనివారం అంగన్‌వాడీ కేంద్రాన్న స్థానిక సీడీపీఓ జయరాం నాయక్ తో కలిసి ఆమె సందర్శించారు. ముందుగా అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన తల్లులను కేంద్ర నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లలతో ముచ్చటించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్,ఆయాలకు కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పిల్లలకు వేడివేడి భోజనం పెట్టాలని సూచించారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు



లబ్ధిదారులకు రేషన్‌కార్డు ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ సురేశ్ షెట్కార్, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్

జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్

జహీరాబాద్: అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులను అందజేస్తామని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ స్పష్టం చేశారు. శనివారం పస్తాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు రేషన్ కార్డులకు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే రేషన్ కార్డులు ఇచ్చారని, తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేషన్ కార్డులను అందజేస్తున్నారని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో కొత్తగా 4,180 మందికి రేషన్ కార్డులను ఇవ్వడంతోపాటు అదనంగా కొత్తగా 15,730 మందిని రేషన్ కార్డుల జాబితాలో చేర్చామని తెలిపారు.



మంత్రి దామోదర రాజనర్సింహను సన్మానిస్తున్న సతీశ్ తదితరులు

రూ.45 కోట్లతో రోడ్ల అభివృద్ధి

మునిపల్లి(అందోల్): మండలంలోని ఆయా గ్రామాల రోడ్ల అభివృద్ధి కోసం రూ.42 కోట్ల నిధులు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీశ్ కుమార్ తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు డబుల్ రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు జీవో వచ్చిన సందర్భంగా సంగారెడ్డిలోని మంత్రి దామోదర నివాసంలో శనివారం ఆయనకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడుతూ...తాటిపల్లి నుంచి పెద్దలోడి మీదుగా మక్తక్యాసారం వరకు డబుల్ రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ అంజయ్య, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, పెద్దచల్మెడ పీఏసీఎస్ చైర్మన్ దుర్గయ్య, మాజీ ఎంపీటీసీ పాండు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు ఊరట

ఆరు నెలల వడ్డీ విడుదల

- రూ. 19.47 కోట్లు జమ
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు
- నేరుగా సభ్యుల ఖాతాల్లో జమ



సమావేశమైన మహిళా సంఘాల సభ్యులు

సంగారెడ్డి జోన్ / సంగారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులోభాగంగా జిల్లాలోని స్వయం సహాయక సంఘాలు వివిధ రకాల రుణాలకు సంబంధించిన వడ్డీ బకాయిలను విడుదల చేసింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉన్న మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు వివిధ రకాల రుణాలను మంజూరు చేస్తుంది. బ్యాంకుల నుంచి తీసుకున్న వివిధ రకాల రుణాలు అందించడంతోపాటు వారు సద్వినియోగం చేసుకుని, లాభాలు వచ్చే వ్యాపారాలు నిర్వహించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టుకున్నారు. స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ, సీఐఎఫ్‌తో పాటు వివిధ రకాల రుణాలను అందిస్తుంది.

నేరుగా రూ.19.47 కోట్ల జమ

జిల్లావ్యాప్తంగా ఉన్న స్వయం శక్తి మహిళా సంఘాలకు రూ.19.47 కోట్ల వడ్డీని విడుదల చేసింది. విడుదలైన వడ్డీ నిధులు నేరుగా మహిళా ఖాతాల్లో జమ కానున్నాయి. గత ఆర్థిక ఏడాదిలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఉన్న వడ్డీ బకాయిలను విడుదల చేసింది. సభ్యులు తీసుకున్న రుణాలతో పాటు వడ్డీని చెల్లించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలో కొన్నేళ్లపాటు వడ్డీ డబ్బులు నిలిపివేసింది. దీంతో మహిళా సంఘాల సభ్యులు వడ్డీ డబ్బులు కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ బకాయిలను విడుదల చేస్తోంది. వడ్డీ డబ్బులు ఖాతాల్లో జమ కావడంతో మహిళా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళా ప్రగతి పథం

గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు అభివృద్ధిచెందేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాల పథకాలను ప్రవేశపెడుతున్నాయి. మహిళా సంఘాల్లోని మహిళలు వ్యాపారవేత్తలుగా అన్ని రంగాల్లో ముందు ఉండేందుకు వారికి ఉచిత శిక్షణలనిస్తూ ఉపాధి కల్పిస్తున్నారు. జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ పథకం (ఎన్ఆర్ఎల్ఎం) ద్వారా స్వయం సహాయక బృందాలు ఏర్పాటు చేసి వారికి ఆర్థిక సహాయం, శిక్షణను అందజేస్తోంది.

విద్యుత్ బైక్‌లు, ఫిష్ వ్యాన్లు...

జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతంలోని మహిళా సంఘాలకు కేంద్రం నుంచి రూ.2.20కోట్లు రానున్నాయి. ఇందులో భాగంగా మహిళల సంఘాలకు చేప పిల్లలు అమ్మడానికి ఎలక్ట్రికల్ బైకులు, మొబైల్ ఫిష్ వ్యాన్లు, మదర్ యూనిట్లు, గొర్రె పిల్లల పెంపకం వంటి వాటిని అందజేయనున్నారు. కోడి పిల్లలను పెంచేందుకు రుణాలను అందించనున్నారు. జిల్లాలో మహిళా సంఘంలోని సభ్యులకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఇవ్వనున్నారు. వీటి ద్వారా మహిళా సంఘాల సభ్యులు మరింత లబ్ధి పొందనున్నారు. జిల్లాలోని 695 గ్రామాలలో 25 మండలాల్లో ఒక 1.95లక్షల మహిళలకు వివిధ రూపాలలో పథకాలను అందించి లబ్ధి చేకూర్చనున్నారు.

నియోజకవర్గాల వారీగా విడుదలైన వడ్డీ (రూ.కోట్లలో)

నియోజకవర్గం	సంఘాలు	మొత్తం
అందోల్	3,151	4.27
నారాయణఖేడ్	2,682	3.01
నర్సాపూర్	906	1.28
పటాన్‌చెరు	2,424	3.53
సంగారెడ్డి	2,679	3.75
జహీరాబాద్	3232	3.62

వ్యాపారవేత్తలుగా ఎదగాలి



గ్రామీణ ప్రాంతంలోని మహిళలు వ్యాపారవేత్తలగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో వివిధ రకాల శిక్షణాలను ఇస్తూ వివిధ రుణాలను అందజేస్తున్నాము. మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న పథకాలు మహిళలకు గ్రామీణ ప్రాంతాలలోనే ఉంటూ వారికి జీవనోపాధి కలిగించడానికి అవకాశాలు కల్పిస్తున్నాం.

- సూర్యారావ్,అదనపు డీఆర్డీఓ



వర్షం కురవడంతో పత్తి పంటకు ఎరువులు వేస్తున్న కూలీలు

వర్షాలతో సాగు జోరు

- జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వానలు
- సంతోషంలో అన్నదాతలు

న్యాల్‌కల్(జహీరాబాద్): చక్రవాత ఆవర్తన ప్రభావంతో జిల్లాలో విస్తారంగా వానలు కురుస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. శుక్రవారం భారీ వర్షం కురవగా శనివారం మధ్యాహ్నం కూడా అంతేస్థాయిలో వర్షం కురిసింది. 13 రోజుల తర్వాత వర్షాలు కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వానలు లేక పంటలు దెబ్బతింటున్న తరుణంలో వర్షాలు కురవడం వల్ల పంటలకు ప్రాణం పోసినట్లయింది. జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో రెండు రోజులుగా వానలు కురుస్తుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

వర్షపాతం ఇలా...

జిల్లాలో శుక్రవారం 30మిల్లీ మీటర్ల భారీ వర్షం కురవగా, శనివారం కూడా కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం కురవగా మరి కొన్ని ప్రాంతాల్లో స్వల్ప వర్షపాతం నమోదైంది. కంగ్టిలో 72 మిల్లీ మీటర్లు, న్యాల్‌కల్‌లో 35.5, వట్‌పల్లిలో 29.8, పుల్‌కల్‌లో 21.3, జహీరాబాద్‌లో 15మిల్లీ మీటర్ల అధిక వర్షపాతం నమోదు కాగా, మిగతా ప్రాంతాల్లో తక్కువ వర్ష పాతం నమోదైంది. జూలై 1న, 2న రెండు రోజుల పాటు 49.6 మిల్లీ మీటర్లు అధిక వర్షం కురవగా 3న స్వల్ప వర్షపాతం నమోదైంది.

7.50 లక్షల ఎకరాల్లో సాగు!

ఈ ఏడాది జిల్లాలో 7.50 లక్షలు ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఐతే ఇప్పటి వరకు 5,46,257 ఎకరాల్లో పంటలను రైతులు సాగు చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. అత్యధికంగా 3,40,799 ఎకరాల్లో పత్తి పంట, 54,528 ఎకరాల్లో సోయా, 57,442 ఎకరాల్లో కంది, 27,193 ఎకరాల్లో వరి సాగు చేసుకోగా మిగిలిన 66,295 ఎకరాల్లో పెసర, మినుము, చెరకు తదితర పంటలను రైతులు సాగు చేసుకున్నారు. జూలై ప్రారంభంలో కురిసిన వర్షం వల్ల పంటలకు ప్రాణం పోసినట్లైంది. రెండు వారాలుగా వర్షాల జాడ లేకపోవడంతో సాగు చేసుకున్న పంటలు దెబ్బతింటుండటంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. పంటల్లో కలుపు తీసిన రైతులు వర్షం పడితే ఎరువులు వేసుకోవచ్చనే ఆశతో ఎరువులను సైతం సిద్ధంగా ఉంచుకున్నారు. చక్రవాత ప్రభావం వల్ల రెండు రోజులుగా వర్షం కురుస్తుండటంతో రైతులు పొలం బాట పట్టారు. సిద్ధంగా ఉంచుకున్న ఎరువులను పంటలకు వేసే పనిలో నిమగ్నమయ్యారు. చాలా రోజుల తర్వాత వర్షం పడడంతో పంటలకు ప్రాణం పోసినట్లయిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పంటలకు మేలైంది



25 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేసుకున్నాను. రెండు వారాలుగా వానలు పడకపోవడంతో పంట దెబ్బతింటుందని భయపడ్డాను. తాజా వర్షాలతో పంటలకు చాలా మేలైంది. -రాజప్ప, రైతు, చాల్కి

సింగూరుకు వరదపోటు



సింగూరు ప్రాజెక్టు నీటి నిల్వ

రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో సింగూరు ప్రాజెక్టులోకి వరద ప్రవాహం పోటెత్తుతోంది. ప్రాజెక్టు పరిసరాల్లో 12 సెంటీమీటర్ల వర్షం కురవడంతో ఆ నీరంతా డ్యాంలోకి చేరుతోంది. డ్యాంలోకి శనివారం ఉదయం 2,658 క్యూసెక్కులు, మధ్యాహ్నం 633 క్యూసెక్కుల ప్రవాహం చేరిందని ప్రాజెక్టు ఏఈ మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా...ప్రస్తుతం 18.622 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి సింగూరు సాగునీటికి 60 క్యూసెక్కులు, తాల్మెల లిఫ్టుకు 33 క్యూసెక్కులు, హైదరాబాద్ మెట్రో వాటర్‌కు 80 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు వదులుతున్నారు.

- పుల్‌కల్(అందోల్)

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్



పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ పరితోశ్ పంకజ్

సంగారెడ్డి క్రైమ్: పోలీసులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణ పోలీసు స్టేషన్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. సిబ్బంది పరేడ్‌ను, బ్యారెక్స్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలోని స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పరితోశ్ పంకజ్ మాట్లాడుతూ...ప్రతి రికార్డును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. టీఎస్-కాప్, హెచ్‌ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, సీఈఐఆర్, సీడీఆర్, సీఈఐఆర్ పోర్టల్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైజ్ వంటి అన్ని రకాల సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తిస్థాయిలో పట్టు సాధించి నేరాల నియంత్రణలో కీలకంగా వ్యవహించాలని సిబ్బందికి ఆదేశించారు.

క్లుప్తంగా

విద్యార్థినికి గోల్డ్ మెడల్



డీఈఓ రాధాకిషన్‌తో లిఖిత, పీడీ శ్రీనివాసరావు

వెల్దుర్తి(తూప్రాన్): స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని సదాల లిఖిత జిల్లాస్థాయి పరుగు పందెంలో బంగారు పతకం సాధించిందని హెచ్‌ఎం సాంబయ్య తెలిపారు. మెదక్ ఇందిరాగాంధీ అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన 60 మీటర్ల పరుగులో ఆమె జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా డీఈఓ రాధాకిషన్ శనివారం ఆమెకు బహుమతి అందజేశారు. విద్యార్థిని లిఖితతోపాటు శిక్షణ ఇచ్చిన పీడీ శ్రీనివాసరావును అభినందించారు.

వన్యప్రాణుల వేట.. అరెస్టు

నర్సాపూర్: వన్యప్రాణులు వేటాడిన ఇద్దరిని శనివారం అరెస్టు చేసినట్లు స్థానిక అటవీ శాఖ రేంజ్ అధికారి అరవింద్ పేర్కొన్నారు. వివరాలు ఇలా... నర్సాపూర్ రేంజ్ పరిధిలోని వెంకట్రావ్‌పేట అటవీ ప్రాంతంలో తిమ్మాపూర్‌కు చెందిన రామ్, వెంకట్రావ్‌పేటకు చెందిన రమేష్ వన్యప్రాణులను వేటాడారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. అధికారులను రేంజ్ అధికారి అభినందించారు.

నెమలిని కాపాడిన రైతు

కొమురవెల్లి(సిద్దిపేట): కుక్కల దాడిలో గాయపడిన నెమలిని రైతు కాపాడి అటవీ అధికారులకు అప్పగించారు. ఈ ఘటన మండలంలోని గౌరయపల్లిలో చోటు చేసుకుంది. శనివారం గ్రామానికి చెందిన కొయ్యడ మల్లేశం తన వ్యవసాయ బావి వద్ద కుక్కలు నెమలిని గాయపరచగా నెమలిని కాపాడి అటవీ అధికారులకు సమాచారం అందించడంతో వారు గోపాలమిత్ర సాయిలును పంపించారు. అతడు గాయపడి నెమలికి చికిత్స అందించి ఫారెస్టు అధికారులకు అప్పగించారు. అనంతరం నెమలిని కొండపాక ఆనంద నిలయం సమీపంలోని అడవిలో వదిలిపెట్టినట్లు సెక్షన్ ఆఫీసర్ రమేష్, బీట్ ఆఫీసర్ చంద్రశేఖర్ తెలిపారు.

చిరుత సంచారం



చిరుత పులి అడుగులను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లి, అల్మాజీపూర్, దౌల్తాబాద్ మండలం గాజులపల్లి, దొమ్మాట గ్రామాల శివారు అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవడంతో శనివారం ఒక్కసారిగా కలకలం రేగింది. దీంతో ఆయా గ్రామాల్లో భయాందోళన నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం సాయంత్రం ఆయా గ్రామాల రైతులు వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికొస్తున్న క్రమంలో దారి పొడవునా ఏదో గుర్తు తెలియని జంతువు పెద్ద పెద్ద కాలి గుర్తులు కనిపించాయి. దీంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అయితే దుబ్బాక అటవీ శాఖ బీట్ ఆఫీసర్ మధుబాల నేతృత్వంలో జంతువు కాలి గుర్తులను పరిశీలించారు. కాలి గుర్తులను మ్యాప్‌ల ఆధారంగా పరిశీలించడంతో ఏడాదిన్నర వయసు కలిగిన చిరుత పులి కాలి గుర్తులుగా నిర్ధారణకు వచ్చారు. కాగా ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఆదివారం చిరుత పులి కదలికలను పసిగట్టడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పట్టుకునే ప్రయత్నం చేస్తామని వెల్లడించారు.

పేదరికం జయించి.. కొలువులు సాధించి

రెక్కాడితే గాని డొక్కాడని పేద, వ్యవసాయ ,కూలీ కుటుంబాల పిల్లలు వీరూ..అయితేనేం చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించారు. ఓ వైపు తల్లిదండ్రులతో పాటు వ్యవసాయం, కూలి పనులు చేస్తూనే కష్టపడి చదువుకొని ఎస్‌ఐలుగా జాబ్‌లు సాధించారు. 21 నెలలు వివిధ అంశాలపై శిక్షణ తీసుకుని ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ స్టేషన్లలో బాధ్యతలు తీసుకున్న యువ ఎస్‌ఐలు, వారి కుటుంబ నేపథ్యం, తల్లిదండ్రుల కష్టం, తదితర అంశాలపై సాక్షి ప్రత్యేక కథనం.

– దుబ్బాక/దుబ్బాకటౌన్:

అంతా వ్యవసాయ, పేద, కూలీ కుటుంబాలే..

- ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎస్‌ఐలుగా బాధ్యతలు
- కడు దయనీయ కుటుంబాల నుంచి వచ్చిన మహిళా ఎస్‌ఐలు
- తల్లిదండ్రుల కష్టానికి ప్రతిఫలం వీరు
- కష్టపడి చదివి ఎస్‌ఐ జాబ్‌లు కొట్టారు



వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చా..

మాది కరీంనగర్ జిల్లా చొప్పదండి నాన్న బీరయ్య, అమ్మ భూదవ్వ. వ్యవసాయం చేసుకుంటూ నన్ను చదివించారు. అమ్మానాన్నలు, భర్త మహేష్ నా ఎస్‌ఐ కల నెరవేరడానికి ఎంతగానో ప్రోత్సహించారు. ప్రస్తుతం కొత్తగా మిరుదొడ్డి ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉంది.

– సమత, మిరుదొడ్డి, ఎస్‌ఐ

తండ్రి టైలరింగ్.. కొడుకు ఎస్‌ఐ



తల్లిదండ్రులతో నాగిరెడ్డిపేట ఎస్‌ఐ భార్గవ్‌గౌడ్

దుబ్బాక పట్టణానికి చెందిన ఐరేని శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీ దంపతుల కుమారుడు భార్గవ్ గౌడ్. నా తండ్రి టైలరింగ్ చేస్తూ కుటంబాన్ని పోషించాడు. గతంలో అస్సాం రైఫిల్‌మెన్‌గా, సీఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాను. ఆర్మీ అధికారి కావాలని కష్టపడి చదివాను. పోలీస్ శాఖ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఎస్‌ఐ పరీక్షకు సిద్ధమై జాబ్ సాధించి కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట ఎస్‌ఐగా సేవలందిస్తున్నా. ఇటు ఎస్‌ఐగా పనిచేస్తూనే నాకు సమయం దొరికినప్పుడు అసిస్టెంట్ కమాండెంట్ ఆర్మీ పరీక్షకు సన్నద్ధమవుతున్నా.

– భార్గవ్, నాగిరెడ్డి పేట ఎస్‌ఐ

అమ్మ కూరగాయలు విక్రయించి..



కుటుంబంతో బెజ్జంకి ఎస్‌ఐ బోయిని సౌజన్య

మాది కరీంనగర్ జిల్లా సైదాపూర్. నాన్న గతంలో మృతి చెందాడు. అమ్మ కూరగాయలు విక్రయిస్తూ ముగ్గురు ఆడపిల్లలను చదివించింది. ఇద్దరు అక్కలు ఉద్యోగాలు సాధించారు. నా విద్యాభ్యాసం కరీంనగర్ లోనే పూర్తి చేశా. నేను కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి ఎస్‌ఐ జాబ్ కోసం కష్టపడ్డా. మా అమ్మ కష్టానికి ఈ ఎస్‌ఐ ఉద్యోగంతో ప్రతిఫలం దక్కింది.

– బోయిని సౌజన్య, బెజ్జంకి ఎస్‌ఐ

అమ్మ కష్టానికి ప్రతిఫలం



మాది కరీంనగర్ టౌన్. నాన్న మల్లేశం, అమ్మ లీలా. నాన్న ఎనిమిదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో కుటుంబ భారం అమ్మపై పడింది. నాకు ఒక తమ్ముడు, అక్క ఉన్నారు. మా ముగ్గురిని అమ్మ చిన్న ఉద్యోగం చేస్తూ చదివించింది. నేను బీటెక్ చదువుతూనే పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యేవాన్ని. బీటెక్ పూర్తి కాగానే పోలీస్ శాఖ నోటిఫికేషన్ రాగానే కష్టపడి చదివి ఉద్యోగం సాధించా.

– ప్రశాంత్, అక్కన్నపేట, ఎస్‌ఐ

4 ఏళ్ల పాప ఉన్నా.. గురి తప్పలేదు



కుటుంబంతో ఎస్‌ఐ సుచిత

పెళ్లయితే అమ్మాయిలు ఏం సాధించలేరు, ఇంటికే పరిమితం అంటుంటారు. కానీ భర్త, కుటుంబం ప్రోత్సహిస్తే ఏదైనా సాధించవచ్చు. నాకు 6 సంతవ్సరాల పాప ఉంది. మాది కామారెడ్డి జిల్లా తాడ్వాయి గ్రామం. నాన్న వివేకానందరెడ్డి హోంగార్డ్, అమ్మ శారద టైలరింగ్ చేసేది. భర్త సుమంత్, తమ్ముడు సంతోష్ ప్రోత్సహించారు. నా ట్రెనింగ్ సమయంలో పాపకు నాలుగేళ్లు. నా భర్త పాపను చూసుకునేవాడు. – సుచిత, ఎస్‌ఐ

కీర్తిని గడించేలా..

కామారెడ్డి జిల్లా బిర్కూర్ గ్రామం మాది. అమ్మ భారతి, నాన్న నాగరాజు వ్యవసాయం చేస్తూ నన్ను చదివించారు. నేను వరంగల్‌లో బీటెక్ పూర్తి చేశా. పోలీస్ అవ్వాలన్నది నా కోరిక. దాని కోసం పడిన కష్టం వర్ణణాతీతం. తల్లిదండ్రుల కీర్తిని పెంచేలా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తా.

– కరీన కీర్తిరాజ్, దుబ్బాక, ఎస్‌ఐ



కుటుంబంతో దుబ్బాక ఎస్‌ఐ కరీన కీర్తిరాజ్

తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు.. కూతురు ఎస్‌ఐ



దుబ్బాక మండలం చీకోడ్ గ్రామానికి చెందిన నందిరి రాజయ్య, సత్తవ్వ దంపతుల ఒక్కగానొక్క కుమార్తె జ్యోతి. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ జ్యోతిని చదివించారు. తల్లిదండ్రులకు గౌరవం దక్కేలా..జ్యోతి ఎస్‌ఐ జాబ్ సాధించి ఔరా అనిపించింది. కాగా దుబ్బాక మండలంలో 2వ మహిళా ఎస్‌ఐగా జాబ్ సాధించిన ఘనత జ్యోతికే దక్కింది.

– జ్యోతి, ఎస్‌ఐ

తండాలో తళుక్కుమన్న నరేశ్..



కుటుంబంతో మాలోత్ నరేష్, ఎస్‌ఐ

తండా ప్రజలు వ్యవసాయానికే పరిమితం ఏం సాధించలేరనేది ఒక్కప్పటి మాట. ఆ మాట మూగపోయేలా అనుకున్న లక్ష్యం కోసం ఎంతో కష్టపడ్డాను. మాది కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఎల్లంపేట గ్రామం. నాన్న లాల్‌బహదూర్, అమ్మ హంసీ. వ్యవసాయం చేసేవారు. నేను ఉన్నత స్థానంలో ఉండాలనేది నా తల్లిదండ్రుల కోరిక. 22ఏళ్లకే ఉద్యోగం సాధించా. ఎస్‌ఐ జాబ్ వచ్చినప్పుడు వాళ్ల కళ్లలో ఆనందం, మాటల్లో చెప్పలేనిది.

– మాలోత్ నరేష్, ఎస్‌ఐ



కుటుంబంతో అరవింద్ కుమార్

5 ప్రభుత్వ ఉద్యోగాల అరవిందుడు

మాది కామారెడ్డి జిల్లా పిట్లం మండలం పోతారెడ్డి పల్లి స్కూల్ తండా. నాన్న లక్ష్మణ్, అమ్మ, జమునా వ్యవసాయం చేసేవారు. తండాలో పుట్టి పెరిగిన నేను చిన్నప్పటి నుంచి ఎస్‌ఐ అవ్వాలన్న లక్ష్యంతో చదివాను. నాకు 5 గురు అక్కాచెల్లెల్లు. ఎస్‌ఐ పరీక్షకు సన్నద్ధమవుతూనే.. 4 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినా పోస్టింగ్ తీసుకోలేదు. కష్టపడితే సాధించలేనిదంటూ.. ఏమి లేదు. ఇదే యువతకు ఇచ్చే సందేశం.

– హలావత్ అరవింద్ కుమార్, ఎస్‌ఐ



తల్లిదండ్రులతో చిన్నకోడూర్ ఎస్‌ఐ సైఫ్ అలీ

కానిస్టేబుల్ టూ..ఎస్‌ఐ

మాది కరీంనగర్ జిల్లా గుంటూర్‌పల్లి. అమ్మ తాహెర బేగం, నాన్న షేక్ అహ్మద్. నాన్న వ్యాపారం చేస్తూ చదివించాడు. నేను 2020లో కానిస్టేబుల్‌గా ఎంపికై విధులు నిర్వహించా. 2023 ఎస్‌ఐ నోటిఫికేషన్‌లో కష్టపడి చదివి ఎస్‌ఐగా ఎంపికయ్యాను. చిన్నకోడూర్ ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించా.

– సైఫ్ అలీ, చిన్నకోడూర్ ఎస్‌ఐ



కుటుంబంతో రాయపోల్ ఎస్‌ఐ మానస

తండ్రి కష్టమే నన్ను ఎస్‌ఐని చేసింది

మాది కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రుక్మాపూర్. అమ్మానాన్నలు కుంచెం రాజేశ్వరి, కనకయ్య. సోదరి, సోదరుడు ఉన్నారు. తన కష్టం పిల్లలకు రాకూడదని తల్లిదండ్రులు కష్టానికి వెనుకాడకుండా చదివించారు. ఎస్‌ఐగా ఎంపికయ్యాను అని తెలియగానే నా తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు.

– మానస, రాయపోల్ ఎస్‌ఐ

తండ్రి కూలీ..



మాది కరీంనగర్. నాన్న వెంకన్న, అమ్మ కనకమ్మ ఇద్దరు కూలీపని చేసేవారు. నేను బీటెక్ పూర్తి చేశాను. నన్ను చదివించేందుకు అమ్మానాన్న రెక్కలు ముక్కలు చేసుకోవడం స్వయంగా చూసిన. నా కుటుంబ నేపథ్యాన్ని సవాల్‌గా తీసుకొని పట్టుబట్టి ఎస్‌ఐ ఉద్యోగం సాధించాను.

– నవీన్,ఎస్‌ఐ చేర్యాల

మొదటి ప్రయత్నంలోనే..



మాది కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం సిరి బీబీపేట గ్రామం. నాన్న భీమరి పోచయ్య 2011లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అమ్మ మంజుల వ్యవసాయం చేస్తూ తమ్ముడిని, మా ముగ్గురు అక్కచెల్లెళ్లను పోషించింది. నేను ఇప్పటి వరకు ఎలాంటి పోటీ పరీక్షలు రాయలేదు. మొదటి ప్రయత్నంలోనే ఎస్‌ఐ ఉద్యోగం సాధించాను. నా ఉద్యోగ ప్రయత్నానికి మేనమామ దేషెట్టి లింగం సపోర్టు చేశాడు.

– సృజన, ఎస్‌ఐ

ఎస్‌ఐ ఉద్యోగంపై ఇష్టంతో..



తల్లిదండ్రులతో అరుణ్‌కుమార్

2018లో కానిస్టేబుల్‌కి ఎంపికై నా ఎస్‌ఐ పోస్టుపై ఇష్టంతో వెళ్లలేదు. తల్లిదండ్రుల కలను సాకారం చేయడానికి ఎస్‌ఐగా ఎంపికై దౌల్తాబాద్‌లో సేవలు అందిస్తున్నాను. కరీంనగర్ జిల్లా గంగాధర గ్రామానికి చెందిన అరుణ్ కుమార్‌కి నలుగురు అన్నదమ్ములు. నాన్న చంద్రయ్య, అమ్మ కాంతమ్మ వ్యవసాయం చేసేవారు. ఎస్‌ఐ ఉద్యోగం సాధించి తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చడంతో సంతోషంగా ఉంది.

– గంగాధర అరుణ్‌కుమార్, దౌల్తాబాద్, ఎస్‌ఐ



దాత అందజేసిన స్పోర్ట్స్ డ్రెస్‌లతో విద్యార్థులు

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్న దాతల సహాయం వెలకట్టలేనిదని హెచ్‌ఎం ఇందుమతి అన్నారు. మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల ఉన్నత పాఠశాలలోని 400 మంది విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన హరికిషన్ అగర్వాల్ కుటుంబ సభ్యులు శనివారం స్పోర్ట్స్ డ్రెస్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. మరిన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ అందించాలని హెచ్‌ఎం కోరగా వారు.. సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన క్రీడాకారులు



ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో అధికారులు

మెదక్‌జోన్: తెలంగాణ స్టేట్ లెవల్ 11వ జూనియర్స్, సీనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో అండర్ 14, 16, 18, 20 పోటీల్లో 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో 40 మంది రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్ తెలిపారు. పట్టణంలోని ఇందిరాగాంధీ (అథ్లెటిక్)స్టేడియంలో ఈ పోటీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కాగా వీటిలో జేమ్స్, త్రోస్, తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించగా ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరు ఆగస్టు 3,4వ తేదీల్లో వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాధాకిషన్, టీఎన్‌జీవో అధ్యక్షుడు నరేందర్, పీఈటీల సంఘం కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు. కాగా ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు పతకాలు అందజేశారు.

వ్యవసాయాధారిత ఉత్పత్తులపై అవగాహన

కౌడిపల్లి(నర్సాపూర్): కేవీకేలో శిక్షణ పొందుతున్న ఎస్సీ మహిళా రైతులను శాస్త్రవేత్తలు హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని పీజేటీఎస్‌ఏయూ (ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ) క్షేత్రపర్యటనకు తీసుకువెళ్లారు. తునికి కేవీకేలో ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా రైతులను శనివారం కేవీకే హెడ్‌అండ్ సైంటిస్ట్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్ ఆధ్వర్యంలో గృహవిజ్ఞాన శాస్త్రవేత్త భార్గవి యూనివర్సిటీకి తీసుకెళ్లి సెంటర్ ఫర్ ఉమెన్ ఇన్ అగ్రికల్చర్‌ను సందర్శించి యంత్రాలు, ప్రాసెసింగ్ యూనిట్స్‌పై అవగాహన కల్పించారు.

సంతానం కలగడం లేదని..

వర్గల్(గజ్వేల్): సంతానం కలగడం లేదన్న మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని మాలపల్లిలో జరిగింది. బేగంపేట ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి ప్రకారం.. గ్రామానికి చెందిన ముల్క సతీష్(45), స్వాతి దంపతులకు పదిహేనేళ్ల క్రితం వివాహమైంది. అనేక ఆస్పత్రులకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్నా పిల్లలు కాలేదు. ఈ క్రమంలో దీంతో సతీష్ తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఇదే విషయమై ఇంట్లో తరచూ బాధపడేవాడు. శుక్రవారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పనుల నుంచి వచ్చిన భార్య స్వాతి భర్త ఉరేసుకుని విగతజీవిగా కనిపించడంతో బోరుమన్నది. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో వ్యక్తి...

గజ్వేల్‌రూరల్: వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని శ్రీగిరిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కేశబోయిన రాములు(54)కు భార్య పెంటమ్మతోపాటు కొడుకు, నలుగురు కూతుర్లు ఉన్నారు. అందరి వివాహాలు జరిగాయి. 13ఏళ్ల క్రితం పెంటమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో అప్పటి నుంచి మానసిక వేదనకు గురైన రాములు మద్యానికి బానిసయ్యాడు. రెండు నెలల క్రితం అనారోగ్యానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స చేయించారు. తాజాగా శనివారం రాములు అస్వస్థతకు గురికావడంతో స్థానిక వైద్యుడి వద్ద చికిత్స చేయించి, కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో స్లాబ్‌కు ఉన్న ఇనుప కొక్కెంకు లుంగీతో ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాత్రికేయ వృత్తి.. సామాజిక బాధ్యత

- పాలన యంత్రాంగం, ప్రజలకు మధ్య వారధి
- కలెక్టర్ హైమావతి



శిక్షణ పొందిన జర్నలిస్టులతో అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు

సిద్దిపేటజోన్: జర్నలిజం అనేది వృత్తి కాదని అది ఒక సామాజిక బాధ్యతగా ప్రతి జర్నలిస్ట్ గుర్తించాలని కలెక్టర్ హైమావతి సూచించారు. శనివారం తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో విపంచి ఆడిటోరియంలో రెండు రోజులుగా కొనసాగుతున్న జర్నలిస్టుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టులు నైతిక నియమాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి, పాలనా యంత్రాంగానికి మధ్య ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా వారధి లాంటిదని అభివర్ణించారు. పాత్రికేయ వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.

పాఠకుల అభిరుచులకు అనుగుణంగా..

నైతిక నియమావళి-మీడియా, చట్టాలు అనే అంశంపై రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ట్రెండ్ మారిందని, పాఠకుల అభిరుచులకు అనుగుణంగా వార్తలు ఉండాలని పేర్కొన్నారు. సాంకేతికతను సమగ్రంగా తెలుసుకుంటే వార్తల సేకరణ సులభం అవుతుందన్నారు. అంతకుముందు తెలంగాణ జర్నలిజం, గతం, వర్తమానం, భవిష్యత్, మీడియా ధోరణులు అనే అంశంపై సంపాదకులు శ్రీనివాస్ మాట్లాడుతూ.. కొవిడ్ ముందు.. తర్వాత పత్రికల్లో మార్పులు వచ్చాయన్నారు. సోషల్ మీడియా యూట్యూబ్‌లో వస్తున్న వార్తలు క్షణాల్లో ప్రజలకు చేరుతున్నాయని పేర్కొన్నారు. అంతకుముందు సీనియర్ జర్నలిస్ట్ ఉడుముల సుధాకర్ రెడ్డి ఫేక్ న్యూస్, సైబర్ క్రైం, సోషల్ మీడియా అంశంపై మాట్లాడారు. అదేవిధంగా సీనియర్ జర్నలిస్ట్ గోవింద్ రెడ్డి నేర వార్తలు అంశంపై వివరించారు. ఈ సందర్భంగా రెండు రోజులుగా శిక్షణ పొందిన వారికి అకాడమీ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీఆర్‌ఓ జయదేవ్ ఆర్య, జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు రంగాచారి, మీడియా అకాడమీ సెక్రటరీ వెంకటేశ్వరరావు, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి